క్లుప్తంగా

కుంకనూరులో వైద్య శిబిరం



సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి

దేవనకొండ: మండలంలోని కుంకనూరు సచివాలయ పరిధిలో డెంగ్యూ కేసులు నమోదు కావడంతో శుక్రవారం వైద్య సిబ్బంది జయలక్ష్మి, శ్రీధర్, సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా పర్యటించారు. గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. దోమల నిర్మూలనకు హైపో ద్రావణం పిచికారీ చేయించినట్లు వారు చెప్పారు. ప్రజలు దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రాత్రి వేళల్లో దోమ తెరలను వాడాలని సూచించారు. జ్వరం, దగ్గు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం అన్ని సచివాలయాల పరిధిలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రజలకు సీజనల్ వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని ఇళ్లలోని డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచుకోరాదన్నారు. అలాగే ఉతికిన బట్టలు ఎప్పటికప్పుడు ఆరవేయాలన్నారు. దోమల బారి నుంచి కాపాడుకునేందుకు దోమతెరలు వాడాలని సూచించారు. రోజు విడిచి రోజు జ్వరం దగ్గు వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

హొళగుంద: మండల పరిధిలోని నెరణికితండా, కొత్తపేట కొండల్లో శుక్రవారం హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు, పోలీసు సిబ్బంది నాటుసారా బట్టీలను గుర్తించి దాడులు చేపట్టారు. అక్కడ సారా తయారీకి బిందెలు, డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను, బిందెలు, ముడి సరుకులను ధ్వంసం చేశారు. ఈ ప్రాంతాల్లో గుట్టు చప్పుడుగా నాటుసారా తయారు చేసి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలుసుకుని పోలీసులు శుక్రవారం ఉదయం దాడులు చేపట్టారు. ఈ మేరకు సారా బట్టిని ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



కుంటలో హంద్రీ-నీవా నీటిని నింపుతున్న దృశ్యం

చిప్పగిరి: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు బంటనహాలు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రమీల తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని బంటనహాలు గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న హంద్రీ – నీవా కాలువ నీటిని గ్రామంలోని నీటి కుంటలోకి మూడు రోజులుగా పంపింగ్ చేస్తునట్లు తెలిపారు. గ్రామంలోని నీటి కుంటను పూర్తిస్థాయిలో నింపితే ఏడాది వరకు గ్రామంలో నీటి సమస్య ఏర్పడదని సర్పంచ్ సుశీలమ్మ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ

చిప్పగిరి: మండలంలో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతి సుజుకి షిఫ్ట్ డిడి 5170 నెంబర్ గల వాహనంలో చిప్పగిరి గ్రామానికి చెందిన రాము, సాయికుమార్ కర్ణాటక నుంచి కర్ణాటక మద్యం అక్రమంగా తీసుకొస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 672 హైవార్డ్ విస్కి (90 ఎంఎల్) మద్యం టెట్రా ప్యాకెట్లు, వాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో పోలీసు సిబ్బంది యశ్వంత్, మదర్ సాహెబ్,భాస్కర్, రామోజి, శంకర్ తదితరులు పాల్గొన్నారన్నారు.

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయండి

ఆలూరు: ఎస్ఎస్ ట్యాంకుల నుంచి నీటిని శుద్ధి చేసిన తర్వాతే గ్రామాలకు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం హాలహర్వి మండలంలోని బాపురం, చింతకుంట గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులను పరిశీలించారు. నీటి నిల్వ సామర్థ్యం ఫిల్టర్‌బెడ్లు, విద్యుత్ మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు, ట్యాంకుల శుభ్రత, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. చింతకుంట, హొళగుంద, ఎల్లార్తి, ఖాజీపురం, సమ్మతగేరి తదితర గ్రామాల్లో నీటి సరఫరాకు సంబంధించి సిబ్బందిని నియమించుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జనాభాకు సరిపడేలా నీటిని ఎల్లెల్సీ నుంచి పంపింగ్ చేసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శివకుమార్ జయదీప్, మల్లికార్జునయ్య, ఏఈలు, మోహన్ బాబు, రాంనేలా, రవి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

తుగ్గలి: అభివృద్ధి, సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. రాతనలో రూ.20.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.75 లక్షలతో సీసీ రోడ్డు, ఆర్.కొత్తూరులో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్లలో చేసి చూపించామని స్పష్టం చేశారు. నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పెద్దఎత్తున సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పావతి, శ్రీదేవి, రాచప్ప, శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, జగన్నాథరెడ్డి, నాగేష్, మోహన్‌రెడ్డి, పులికొండ, హుసేన్, ఉమామహేశ్వరరెడ్డి, శ్రీదేవి, చాంద్‌బాషా, అన్వర్, గోపాల్‌రెడ్డి, నారాయణనాయక్ పాల్గొన్నారు.



రాతనలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

అమ్మవారికి బంగారు బొట్టుబిళ్ల విరాళం

మద్దికెర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన శ్రీ మద్దమాంబ అమ్మవారికి రూ.1.70 లక్షల విలువచేసే బంగారు బొట్టుబిళ్లను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జెడ్పీటీసీ మురళీధరరెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, పంచాయితీ సలహాదారుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీలో కొలువైన దేవమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రథోత్సవ కార్యక్రమాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.



బంగారు బొట్టు బిళ్లను ఆలయ నిర్వాహకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వైభవంగా చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి కొలుట్ల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథాంగ హోమం, రథాంగబలి కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. రథాన్ని కొంచెం ముందుకు కదిలించి పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ఆర్.హనుమంత రెడ్డి, కమిటీ మెంబర్లు చింతమాను మహాలింగడు, లక్ష్మి, పండితులు విద్యాదర స్వామి, పులికొండ ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మాట్లాడుతూ.. శనివారం రథోత్సవానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అలాగే రాత్రి కొలుట్ల చెన్నకేశవస్వామి నాటకం, పంచమంకములు నాటక ప్రదర్శన ఉంటుందని చెప్పారు.



రథం ముందు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్, వేద పండితులు, భక్తులు

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన ఘర్షణలో గాయపడ్డ బోయ రవికుమార్ (35) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఘటనపై రూరల్ సీఐ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో రెండు రోజుల క్రితం కుళాయి విషయంతో ఒకే వర్గానికి చెందిన రెండు కుటుంబాలు గొడవ పడ్డాయన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బోయ రవికుమార్‌ను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడని చెప్పారు. దాడికి పాల్పడిన బోయ గోవిందు, లోకేష్, వెంకటేష్, శ్రీను, నరసయ్య, పరమేష్, మారెన్న, ఈరన్న, గౌరెల కేశన్నపై హత్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

భయం వీడి పరీక్షలకు సన్నద్ధం కండి



కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినితో మాట్లాడుతున్న జీసీడీఓ సునీత

కృష్ణగిరి: ప్రతి విద్యార్థి భయం వీడి పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొంటే విజయం వరిస్తుందని జీసీడీఓ సునీత సూచించారు. కృష్ణగిరిలోని కస్తూర్బా విద్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ఇంటర్, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితం వస్తుందన్నారు. ఉన్న సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు చదవడం, రాయడం కంటే బృందంగా కూర్చొని చర్చించుకుంటే ఎక్కువగా జ్ఞాపకం ఉంటుందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం భోజన శాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, రాధమ్మ, సీఆర్‌టీ, పీజీటీలు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధన కోసం ఉద్యమాలు

గోనెగండ్ల: ఎబీసీడీ వర్గీకరణ సాధన కోసం మదిగ, ఉపకులాలు ఉద్యమాలు చేపట్టాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరిగిరి రవి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బైలుప్పల గ్రామంలో తాలూకా అధ్యక్షుడు మారెప్ప ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆది ఆంధ్ర దుగ్గెన్న, ఉపాధ్యక్షులుగా జగ్గుల వీరన్న, సామేలు, కార్యదర్శిగా హనుమంతుతో పాటు మరికొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరుబాట పట్టిన రైతులపై పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఓ రైతు మృతి చెందడం బాధాకరమని అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి బాలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఇందుకోసం మూడు చట్టాలను తెచ్చిందని ఆరోపించారు. అందుకు వ్యతిరేకంగా పోరాటం చేసే రైతులపై కాల్పులు చేయడం దుర్మార్గమన్నారు. మృతి చెందిన రైతు కుటుంబాన్ని ఆదుకొని ఆయా చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు.

పేదల ఆరోగ్యానికి 'సురక్ష'



గోవర్ధనగిరిలో ఈసీజీ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



మద్దికెరలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని గోవర్ధనగిరి-2 వీహెచ్‌సీలో ఎంపీడీఓ శివశంకరప్ప, గోవర్ధనగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీధరరెడ్డి, డాక్టర్ నవీన్‌కుమార్, సర్పంచ్ ఎల్లరాముడు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 432 మంది ఉచితంగా వైద్య సేవలందుకున్నారు. కార్డియాలజిస్టు డాక్టర్ పి చంద్రశేఖర్, గైనకాలజిస్టు డాక్టర్ నర్మద వైద్యసేవలందించారు. అవసరమైన వారికి ఈసీజీ, పలు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. మెరుగైన చికిత్స అవసరమైన 8 మందికి ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా వైద్యమందించేలా కర్నూలు ఆసుపత్రులకు రెఫర్ చేశారు. ఆప్తాల్మజిస్టు కవిత కంటి వైద్య సేవలందించారు. గ్రామ పరిధిలోనే స్పెషలిస్టు వైద్య సేవలందడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మద్దికెర: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. శుక్రవారం మద్దికెర సచివాలయం-3 పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలకు చెందిన ప్రజలకు శిబిరానికి తరలిరాగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పెండేకల్లులో బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

తుగ్గలి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం సంపూర్ణ భరోసా కల్పిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు అట్ల బసిరెడ్డి, సర్పంచ్ లీలావతి, ఎంపీటీసీ సభ్యుడు పెద్ద రంగన్న అన్నారు. శుక్రవారం పెండేకల్లు ఆర్‌బీకే ఆవరణలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులు ప్రజలకు వైద్య సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఘనంగా కలశ ప్రతిష్ట

మద్దికెర: స్థానిక ఎస్సీ కాలనీలో కొలువైన దేవమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఘనంగా కలశ ప్రతిష్ట చేశారు. ముందుగా కలశాన్ని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కలశ ప్రతిష్ట చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం, ప్రసాదం వినిమయం చేశారు. సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

మద్దికెర: మండల కేంద్రంలోని బొజ్జనాయుని పేట రహదారిలో అభివృద్ధి శిలాఫలకాన్ని శుక్రవారం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ నెల 20వ తేదీ మద్దికెర నుంచి బొజ్జనాయునిపేట గ్రామానికి రూ.2.90 కోట్లతో వేసిన తారు రోడ్డును ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించి శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయితే అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు శిలాఫలకాన్ని రాళ్లతో పగులగొట్టారని జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న మండలంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక ఇలాంటి పిచ్చి పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలించారు. ఎంపీటీసీ గద్దల ఆంజనేయులు, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజావలి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు నాగేష్, చంద్ర ఉన్నారు.



ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు

చిప్పగిరి: గ్రామాలలో మలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలోని రామదుర్గం గ్రామంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగురున్నాయి. గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీ కాలువలు అందుబాటులో లేకపోవడంతో మురికి నీరు ప్రధాన రహదారి గుండా ప్రవహిస్తూ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం డ్రైనేజీ కాలువ నిర్మాణంతో ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న సమస్య తీరనుందని సర్పంచ్ రోహిణి తెలిపారు.

27 నుంచి మస్తాన్‌వలి ఉరుసు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో వెలసిన మస్తాన్‌వలి స్వామి ఉరుసు మహోత్సవాన్ని ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొలిచిన వారికి కొంగుబంగారంగా మస్తాన్‌వలి స్వామి భక్తులచే పూజలందుకుంటున్నారు. ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని చుట్టుపక్కల గ్రామాల నుంచి దర్గాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 26న గంధం, 27న ఉరుసు, 28 జియారత్‌తో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు వెల్లడించారు.

విజేత అనంతపురం వృషభాలు

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో శివాలయం, వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభాల ప్రతిష్ట సందర్భంగా శుక్రవారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన రాణిమడుగు బెస్త శ్రీరాములుకు చెందిన వృషభాలు మొదటిస్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో తెలంగాణకు చెందిన కురువ కరెప్ప వృషభాలు, మూడో స్థానంలో దేవనకొండ మండలం బెల్లందొడ్డి గ్రామానికి చెందిన దుర్గయ్య వృషభాలు, నాలుగోస్థానంలో అనంతపురం జిల్లా బొందెలదిన్నెకు చెందిన జంగం బ్రదర్స్ వృషభాలు, ఐదో స్థానంలో నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కోరం గిరిజాకు చెందిన వృషభాలు నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు.



బండను లాగుతున్న వృషభాలు

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వంలో ప్రజా వైద్యంతో పాటు విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక పేర్కొన్నారు. నందవరంకు చెందిన ఎరుకల రాధమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.40 వేల చెక్కును, ముగతి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మకు రూ.32 వేల చెక్కును ఆమె శుక్రవారం సాయంత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ జాబితాలో లేని వైద్య చికిత్సలను ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయించుకున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం సాయం మంజూరు చేస్తుందని వివరించారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ సీఎం వైఎస్ జగన్ ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ తదితర కార్యక్రమాలు చేపట్టారన్నారు. నిరంతరం పేదల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నందవరం మండల కన్వీనర్ శివప్పగౌడ్, ముగతి గ్రామ సర్పంచ్ విరూపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి చెక్కును అందిస్తున్న సమన్వయకర్త బుట్టారేణుక

సీఎం జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం



నగరూరులో సమన్వయకర్త విరూపాక్షిని గజమాలతో సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆస్పరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు, రైతులకు గ్రామాల్లోనే అన్ని రకాల సేవలందిస్తూ గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చారని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని నగరూరు, హాలిగేర, అట్టికల్లు గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నగరూరు గ్రామంలో హజరత్ బాబాసాహెబ్ తాత ఉరుసు సందర్భంగా దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో సమన్వయకర్తకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. ఆయా గ్రామాల్లో విరూపాక్షి అవ్వా, తాతలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ఆస్పరి మండలంలో మంచి నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యేలా కృషిచేస్తానని చెప్పారు. నగరూరు గ్రామంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణుడి ఆలయానికి తన వంతుగా సాయం చేస్తానన్నారు. జేసీఎస్ జిల్లా కన్వీనర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, సర్పంచులు సావిత్రమ్మ, లింగమ్మ, ఎంపీటీసీ శంకరన్న, నాయకులు మారయ్య, దత్తాత్రేయ రెడ్డి, కేశవ రెడ్డి, మోహన్, పాండు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

దేవనకొండ: మండలంలోని నేలతలమరి గ్రామంలో సేవా పురస్కారాలు పొందిన వలంటీర్లను శుక్రవారం మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ రాజారెడ్డి, మండల వ్యవసాయ సలహాదారుడు అంబిరెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల సేవలను గుర్తించి ప్రోత్సాహకాలను అందించడంతో పాటు సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న జేసీఎస్ మండల కో–ఆర్డినేటర్ రాజారెడ్డి, నాయకులు

ఉర్దూ విద్యార్థులకు న్యాయం చేయాలి

హొళగుంద: హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి సీబీఎస్ఈలో సెకండ్ లాంగ్వేజ్ కింద తెలుగుతో పాటు ఉర్దూ మీడియం కొనసాగించాలని, ప్రత్యేక ఉర్దూ హైస్కూల్‌ను ఏర్పాటు చేయాలని రాయలసీమ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (ఆర్‌యూటీఏ) నాయకులు డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ అమలు చేయడం వల్ల ఉర్దూ మీడియం విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందుల గురించి తెలుసుకునేందుకు శుక్రవారం హొళగుందకు వచ్చిన ఆర్‌యూటీఏ అధ్యక్షుడు రాకిబ్, సెక్రటరీ నిసార్ అహ్మద్ బృందానికి సమస్యను వివరించారు. మండలంలో ముస్లిం మైనార్టీలు ఎక్కువ సంఖ్యలో ఉండడం వల్ల ఇక్కడి విద్యార్థులు కన్నడ, ఉర్దూ మీడియం అధిక సంఖ్యలో చదువుతున్నట్లు వివరించారు. ఈ ఏడాది సెకండ్ లాంగ్వేజ్ కింద కన్నడ, ఉర్దూ అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు జెడ్పీ హైస్కూల్ వద్దకు చేరుకుని ఉపాధ్యాయులకు వినతిపత్రం అందజేశారు. ముస్లిం పెద్దలు ఈశా, హమిద్, సుబాన్, ఇర్ఫాన్ తదితరులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హొళగుందలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఘనంగా లాలూస్వామి ఉరుసు

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో వెలసిన లాలూస్వామి ఉరుసు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఉరుసు సందర్భంగా గ్రామం బంధువులతో కళకళలాడుతోంది. ఉదయం నుంచే గ్రామస్తులు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధం కార్యక్రమం రాత్రి 11 గంటలకు ప్రారంభించి గ్రామ పురవీధుల గుండా అశ్వంపై ఊరేగించి శనివారం ఉదయం 8 గంటలకు స్వామికి సమర్పించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉరుసు సందర్భంగా గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



లాల్‌స్వామి సమాధికి పూజలు చేస్తున్న భక్తులు